**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

# ప్రాచీన భారతీయ విజ్ఞాన సాహిత్యం

**డాక్టర్ కిలారి గౌరీ నాయుడు**
తెలుగు అధ్యాపకుడు
పి.ఆర్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కాకినాడ.

**పరిచయం:** ఆలోచనామృతం సాహిత్యం అని అంటారు. అంతేకాదు విశ్వ శ్రేయః కావ్యం అని నన్నయ్య తన మహాభారత రచనలో పేర్కొన్నాడు. అంటే అది లోకానికి శ్రేయస్సు కలిగించేదిలా ఉండాలన్నది వారి భావన. ఈ ఆదర్శాన్ని అనుసరించి మన ఋషులు, కవులు సాహిత్యాన్ని సృష్టించారు. ఒక జాతి సంస్కృతి, ఆదర్శాలు, ఆశయాలు, జీవన విధానం మొదలగు విషయాలను తెలుసుకోవడానికి ఆ దేశ సాహిత్యాన్ని మించిన సాధనం మరొకటి లేదు. ప్రాచీన భారతంలో సాహిత్య కృషి ఎప్పుడు ఆరంభమైనది అన్న ప్రశ్నకు కాల గణన చెప్పడం అతి కష్టమైన అంశం. అది కొన్ని వేల సంవత్సరాలకు పూర్వమే సుదీర్ఘకాలం కొనసాగిందని అంటే అతిశయోక్తి కాదు.

భారతీయ ఆత్మ, భారతీయ జీవన విధానమునకు ఆధారంగా భావించే ప్రాచీన భారతీయ సాహిత్యం అతి విస్తృతమైనదే కాక వైవిధ్యంతో కూడినది, సుదీర్ఘ చరిత్ర కలిగినది. ఆనాటి సాహిత్యమంతా సంస్కృత బాషలో ఉంది. భారతదేశంలో చాలా ప్రాంతీయ బాషలపై జీవన విధానంపై చెరగని ముద్ర వేసిన బాష మన దేశంలోనే భిన్న ప్రాంతాలలోని ప్రజలు భౌతికంగా, ప్రాంతీయంగా, భాషాపరంగా తెగలపరంగా అనేక వైరుధ్యాలు కలిగి ఉన్నప్పటికీ తామంతా ఒకే సంస్కృతి వారసత్వానికి చెందిన వారం అనే భావాన్ని అనాదిగా ఆ సాహిత్యం పెంపొందిస్తూ వచ్చింది. మన ప్రాచీన భారతీయ సాహిత్య విజ్ఞానం ఒక వర్గానికో కొంతమంది మేధావులకో చెందినది కాదు. దీనిలో సార్వజనీన మైన అనేక ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. సత్యాన్వేషణ, మానవాళి సమిష్టి మనుగడ, సుఖము, శాంతి శ్రేయస్సుల కోసం ఉదాత్త మేధాసంపత్తి కలిగిన మహనీయుల సమిష్టి కృషి తత్వ జిజ్ఞాస ఫలితమే మన ప్రాచీన భారతీయ సాహిత్యం. అయితే మనకు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు కనిపించవచ్చు కొన్ని మూలభావాలకు వ్యతిరేకమైన అంశాలను కాలాంతరంలో ఇతరులు జోడించి ఉండవచ్చు.

ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన సాహిత్యంగా వేదాలను పరిగణిస్తారు. వేదము అనే మాట విద్ అనే ధాతువు నుంచి పుట్టినది. దానికి జ్ఞానం, ఎరుక తెలివి, వివేకం వంటి అర్థాలు ఉన్నాయి. అబిష్టములను నెరవేర్చుకోవటానికి తగిన ఉపాయములను ప్రబోధించినది వేదమని అంటారు. 'అనంతో వైవేద:' అని చెప్పడం చేత వేదము అనంతమైనదిగా భావిస్తారు. అది పవిత్ర హృదయము నుండి ఆవిర్భవించింది. అవి ఏనాడు ఉద్భవించినవి అన్నదానికి ఖచ్చిత మైన కాలం ఎవరూ చెప్పలేరు. కాని వర్గీకరణ మాత్రం మహాభారత కాలంలో సుమారుఐదు వేల సంవత్సరాలకు పూర్వం జరిగినట్లు

పండితులు చెప్తారు. అందుకు ప్రధాన కారణం వేదవ్యాసుడు కురుపాండవులకు సమకాలీనుడు కావడమే. వేదమునకు శ్రుతి, అనుస్వర, త్రయీ, అమ్నాయము, సమామ్నాయం, చందస్సు, స్వాధ్యాయ గమ, ఆగమ అనే పేర్లు కూడా ఉన్నాయి వేదాలు భారతీయ సంస్కృతికి పునాది మరియు అమూల్యమైన జ్ఞాన సంపద .ఇవి ఆధ్యాత్మికత, తత్వశాస్త్రం, యోగ, ఆయుర్వేదం, ఖగోళ శాస్త్రం, గణితం మరియు సామాజిక విలువలపై విస్తృతమైన జ్ఞానాన్ని అందిస్తాయి. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం మరియు అధర్వణ వేదం అనే నాలుగు విభాగాల ద్వారా మానవాళికి జీవన విధానం నీతి మరియు విశ్వాసాలను ఇవి బోధిస్తాయి. వేదాలలో సర్వవ్యాప్తమైన సత్యాన్ని మరియు ఆత్మ జ్ఞానాన్ని తెలియజేస్తాయి. వేదాలలో గ్రహాల కదలికలు, గణితం, ఖగోళ శాస్త్రం గురించిన ప్రస్తావనలు కూడా ఉన్నాయి. వేదంగాలలో భాగంగా శిక్ష, వ్యాకరణం, కల్పము, నిరుక్తము, చందస్సు, జ్యోతిష్యము, శిక్షా శాస్త్రము వంటి శాస్త్రాలు వికసించాయి. అంతేకాకుండా ప్రాచీన సంస్కృత సాహిత్యాన్ని సక్రమంగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. సత్యం, ధర్మం, సోదర భావం మరియు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని వేదాలు ప్రబోధిస్తాయి. దైనందిన జీవితంలో ఆచరించాల్సిన ఆచారాలు మరియు కర్మకాండలను వేదాలు నిర్దేశిస్తాయి.

మానసిక ప్రశాంతత మరియు ఆధ్యాత్మిక ఉన్నతి కోసం ధ్యానం, యోగాభ్యాసం మరియు మంత్రోచ్చారణ యొక్క ప్రాముఖ్యతను వేదాలు నొక్కి చెబుతాయి. వేదాలు కేవలం మత గ్రంథాలు మాత్రమే కాదు అవి భారతీయ సాంస్కృతిక శాస్త్రీయ మరియు మేధోపరమైన వారసత్వానికి మూల స్తంభాలుగా నిలుస్తాయి.

ప్రతి వేదానికి చివరిలో ఉపనిషత్తులున్నాయి. వేదముల చివర ఉండడం చేత వీటిని వేదాంతములని కూడా అంటారు ఉపనిషత్తులలోని భావాలు ఏకముఖంగా లేవు. అంటే భిన్న ఉపనిషత్తులోని భిన్న భావాలను క్రోడీకరించి వాటి సారాంశాలుగా కొన్ని సూత్రాలను రూపొందించడం జరిగింది. వాటిని బ్రహ్మ సూత్రాలు అన్నారు. ఇదే వేదాంత దర్శనంగా ప్రచారం పొందింది. మొత్తం వేద శాఖలను దృష్టిలో ఉంచుకొని పదకొండు వందల ఎనభై వరకు ఉపనిషత్తులు ఉండవచ్చునని అంటారు కానీ నేడు నూట ఎనిమిది ఉపనిషత్తుల వరకు లభ్యమవుతున్నాయి. ఆదిశంకరుడు వీటిలో పదింటికి వ్యాఖ్యానం రాశాడు. అవి ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండుక్య, తైత్తరయ, ఐతరేయ, చాంద్యోగ, బృహదారణ్య ఉపనిషత్తులు. ఈ చరాచర జగత్తు పరమేశ్వరి నుండి వచ్చినదని, మానవుడు తనకు విహితమైన కర్మలను నెరపేక్షంగా నిర్వహిస్తూ ఆత్మజ్ఞానం పొందాలని, ఎవడు సమస్త జీవరాశిని ఆత్మలో చూచునో, ఆత్మ అన్నిటియందు ఉన్నట్లు చూచునో, సకల వస్తువులు ఆత్మగా భావించునో అట్టివాడు మోహమును పొందజాలుడు. అతడు సామాన్య మానవులు పడు దుఃఖ వికారాలకు లోను కాడు అన్నది ఉపనిషత్తు సారంగా పెద్దలు చెబుతారు. సత్యం, జ్ఞానం, బ్రహ్మ ఈ మూడు అనంతమైనవిగా

United International Journal of Multidisciplinary Research
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

ఉపనిషత్తులు పేర్కొంటాయి. మన పూర్వీకులు పేర్కొన్న చతుర్దశ విద్యలలో నాలుగు వేదాలు, ఆరు వేదంగాల తర్వాత పేర్కొనబడినవి మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం, ఈ నాలుగింటిని ఉపాంగాలని కూడా అంటారు. వేద వచనాలకు కేవలం పైపై అర్థాలనే తీసుకుని తప్పుడు భావాలు ప్రచారం కాకుండా అసలైన భావాలను వివరించడం కోసం చేయబడిన వ్యాఖ్యానాలే మీ మాంస అని అంటారు. దీనిలో పూర్వమీ మాంస ఉత్తర మీ మాంస అని రెండు రకాలు. ఇదంతా ఒక తర్కబద్ధమైన జ్ఞాన చర్చ. పాశ్చాత్య తత్వ విచారణలో గతి తార్కిక వాదంతో దీనిని పోల్చవచ్చు. పూర్వమీమాంస జై మినీ చేతను, ఉత్తర మీమాంసవ్యాసుల వారి చేతను ప్రతిపాదించబడినవి. పూర్వమీమాంస విషయం ధర్మమని ఉత్తరమీమాంస బ్రహ్మమని అంటారు జైమినీ మహర్షి తన పూర్వ మీమాంసలో వైదిక కర్మలను గూర్చి వివరించగా, వేదవ్యాసుడు బ్రహ్మసూత్రాల ద్వారా జ్ఞానకాండకు సంబంధించిన చర్చకు మార్గదర్శకత్వం వహించాడు.

తర్కం ద్వారా సృష్టికి మూలం పరమేశ్వరుడే అని నిరూపించడం న్యాయ శాస్త్రం యొక్క ధ్యేయం. అయితే ఇప్పటి న్యాయ శాస్త్రం రాజ్యాంగ పరిపాలన, నేరాలు- శిక్షలు, ప్రభుత్వ చట్టాలు మొదలగు వాటి గూర్చి తెలియజేస్తాయి. ప్రాచీన న్యాయ శాస్త్రాన్ని కూర్చిన వాడు గౌతమ మహర్షి. వేదాలపై కలిగే రకరకాలైన సందేహాలను నివృత్తి చేయుటకు ప్రామాణికమైన తర్కబద్ధమైన చర్చ న్యాయ శాస్త్రంలో కనిపిస్తుంది. ప్రాచీన న్యాయ శాస్త్రం ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం అను నాలుగు పద్ధతుల ద్వారా మౌలిక సత్యాలను చర్చిస్తుంది. ఈ న్యాయ శాస్త్రాన్ని వైశేషికం అంటారు అందుకు కారణం వైశేషికం పేరిట కణాధుడు న్యాయ శాస్త్రం గూర్చి వ్రాయడమే. గౌతముని న్యాయ శాస్త్రం పై వాత్సాయనుడు వ్యాఖ్యానం రాశాడు. జయంతుని న్యాయ మంజరి, అన్నం బట్టుని తర్క సంగ్రహం, ఉదయనుని న్యాయ కుసుమాంజలి, ప్రశస్తపాదుని పదార్ధ సంగ్రహం వంటి ప్రాచీన న్యాయ శాస్త్ర గ్రంధాలు లభ్యమవుతున్నవి. గతంలో న్యాయ శాస్త్ర విద్యార్థులు వీటిని చదివేవారు.

వేదాలు ప్రభు సమ్మితములు అని, పురాణాలు మిత్ర సమ్మితములు అని అంటారు. పురాణాల్లో చర్చించే ధర్మం మిత్రుని వలె హితాన్ని ఉపదేశిస్తాయి అని అంటారు. భారతీయ సాహిత్యంలో పద్దెనిమిది పురాణాలు ఉన్నాయి మహా పురాణాలను అనుసరిస్తూ పద్దెనిమిది ఉప పురాణాలు వాటిను అనుసరించి మరో పద్దెనిమిది ఔప పురాణాలు రాశారు. పురాణ గాథలలో సృష్టి పరిణామ స్వరూపము, జీవోత్పత్తి క్రమం కథల రూపంలో ఉన్నాయి. పురాణాలు కేవలం కథలుకావు అవి భారతీయ విజ్ఞాన సర్వస్వంగా చెప్పవచ్చు. సృష్టి క్రమం, ఖగోళ శాస్త్రం, ఆయుర్వేదం, పర్యావరణ పరిరక్షణ, యోగ మరియు ధర్మశాస్త్రాలకు సంబంధించిన లోతైన జ్ఞానాన్ని పురాణాలు సర్గ ప్రతి సర్గ వంటి అంశాల ద్వారా నిక్షిప్తం చేశాయి. వేదాల జ్ఞానాన్ని సామాన్యులు అందించే సాధనాలుగా ఇవి నిలిచాయి. మొత్తం పద్దెనిమిది పురాణాలు భారతీయ సాంస్కృతిక మరియు విజ్ఞాన వ్యవస్థకు మూలాధారాలుగా పేర్కొనవచ్చు.

మన ప్రాచీన ఋషుల భావనలో మానవుడు సాధించవలసిన పురుషార్ధములు ధర్మార్ధ కామ మోక్షాలు. ధర్మాన్ని వదిలి కేవలం అర్ధ కామములే జీవిత పరమార్ధం అనుకున్న ఆధునిక బ్రతుకులు ఎంత గందరగోళమో వేరే చెప్పవలసిన పనిలేదు. వేదోక్తమైన ధర్మ స్వరూపంతో నిత్యజీవిత కర్మలు మలుచుకోవడానికి మార్గ నిర్దేశకాలే ధర్మశాస్త్రాలు.

మానవ ప్రవర్తన జీవన రంగాలకు సంబంధించిన అన్ని విషయాలను ధర్మశాస్త్రాలు చర్చించినవి. ఈ ధర్మశాస్త్రాలనే స్మృతులని అంటారు మనువు, పరాశరుడు యాజ్ఞ వల్క్యుడు, అంగీరసుడు, గౌతముడు, శంకుడు, ప్రచేతనుడు, అత్రి, బృహస్పతి, ఆపస్తంబుడు వంటి వారు అనేక స్మృతులను వెలయించారు. నేటి న్యాయస్థానాలు హిందూ కుటుంబ వివాదాలను యాజ్ఞవల్క్య స్మృతికి వ్యాఖ్యానాలుగా భావించే మితాక్షరం లేదా దానిపై రాసిన ధర్మ సింధువు వంటి గ్రంథాల ఆధారంగా పరిష్కరిస్తారు.

ఆధునిక విజ్ఞానం ఆవిష్కరించిన అనేక సత్యాలు విశ్వమును గూర్చి వేదాంత దర్శనము చర్చించిన మౌలిక అంశాలకు చాలా దగ్గరగా ఉంటాయి మన ప్రాచీన శాస్త్రాలు ప్రబోధించిన అనేక అంశాలలో శాస్త్రీయత, ఆధ్యాత్మికత, నైతికత, తాత్వికత, సామాజిక చింతన, న్యాయం, ధర్మం జీవిత పరమార్ధం వంటి అనేకం పెనవేసుకుని ఉన్నా యి.

ఈర్ష్యా ద్వేషాలతో కూడిన మానవ మనసు ఎన్ని అనర్ధాలను సృష్టించగలదో వ్యాసుడు మహాభారతంలో చూపిస్తాడు. ధర్మం యొక్క స్వరూపాన్ని వివరించడంలో అతి సామాన్యునికి కూడా అందుబాటులో ఉండడం చేత మహాభారతం పంచమ వేదముగా ప్రసిద్ధికెక్కినది. కథాకథన రూపం లోనూ, సంభాషణ పద్ధతిలోనూ, చర్చా రూపం లోనూ న్యాయాన్ని ధర్మాన్ని వివరించడంలో దానికి అదే సాటి అన్న రూపంలో మహాభారత రచనను వ్యాసుడు కొనసాగించాడు. మహాభారతంలో సృష్టించిన పాత్రల ద్వారా ఆయన చేసిన తర్కం, బుద్ధి స్వచ్ఛత, పరిణతి, లోతైన శాస్త్ర పరిజ్ఞానం, అపారమైన లోక పరిశీలన మానవ జీవిత పరమార్ధం మానవజాతికి శాశ్వతముగా కాంతిని వెదజల్లేవిగా ఉన్నవి. మనం అనుభవించే సుఖసంతోషాలు మనం అనుసరించే ధర్మం మీద ఆధారపడ్డాయని వ్యాసులవారు ఎలుగెత్తి చాటాడు. సామాజిక జీవనంలో మానవుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలు ఎలా ఉండాలో రామాయణంలో వాల్మీకి ప్రవచించిన విలువలు అజరామరమైనవి. వాటికి దేశకాల అవధులు లేవు. రామాయణంలో భారతీయ విజ్ఞానం ప్రాచీన భారతదేశ ఉన్నత సాంకేతికతకు నిదర్శనం. ఆయుర్వేదం మరియు వైద్యశాస్త్రం అంతరిక్ష మరియు ఖగోళ శాస్త్రం ఇంజనీరింగ్, విమానయాన, పర్యావరణ, రాజనీతి, విజ్ఞాన శాస్త్ర అంశాలు పొందుపరచబడ్డాయని భారతీయ విజ్ఞాన పరిశోధకులు తెలియజేశారు. రామాయణం కేవలం పురాణం మాత్రమే కాదు ప్రాచీన భారతీయుల శాస్త్రీయ దృక్పధాన్ని తెలిపే ఒక జ్ఞాననిధిగా సాహిత్యకారులుఅభివర్ణించారు.

**ముగింపు:** గతంలో మనకున్న పురాణ శ్రవణం హరికథా కాలక్షేపం వంటి ఆచారాల వల్ల పండిత పామరులు సైతం మన శాస్త్రాలలోని అంశాలు తెలుసుకునే వీలుండేది. నేడవి ఒట్టి చాదస్థాలుగా మారిపోయాయి. సోషల్ మీడియా ప్రసారమాధ్యమాలు వెదజల్లే భావ కాలుష్యం దృశ్య కాలుష్యం గురించి ఆలోచించే తీరుబడి, భారతీయ సాహిత్య రచనలు చదివే అలవాటు మనకు లేకపోవడం దురదృష్టకరమైన అంశం. మానవ స్వభావం గురించి మన పూర్వీకులు 'యద్భావం తద్భవతి' ఒక మాటలో చెప్పారు ముందుగా మన ఆలోచనలు సరి చేసుకుంటే మన నడవడి జీవితంలో సరైన మార్గంలో నడుస్తామని పెద్దలు భావన. సుదీర్ఘమైన మన పూర్వీకుల ఆలోచన విజ్ఞాన సాహిత్యాన్ని భవిష్యత్ తరాల వారికి అందించాలంటే పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్య వరకు విద్యా విధానంలో భాగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా విద్యార్థులు తమ మూలాలను అర్థం చేసుకుంటారు. స్థానిక భాషలో భారతీయ విజ్ఞాన సాహిత్యాన్ని బోధించేలాగా విద్యా ప్రణాళికను పటిష్టవంతం చేయాలి . మన ప్రాచీన భారతీయ సారస్వతం గూర్చి అవగాహన కలిగించేలా సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేయాలి. భారతీయులకు వారసత్వంగా వచ్చిన సాహిత్య విజ్ఞానాలను నేటి తరం పిల్లలకు పరిచయం చేస్తూ భవిష్యత్ తరాల వారికి కొనసాగేటట్లు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

**ఆధార గ్రంథాలు:**

1. భారతీయ సంస్కృతి తత్వం- డాక్టర్ గుమ్మా వీరన్న
2. భారతీయ వారసత్వము సంస్కృతి డాక్టర్ దాచేపల్లి దుర్గయ్య
3. భారతీయ వారసత్వం- సంస్కృతి సరోజినీ రేగాని
4. ఆధునిక భారత చరిత్ర -బిపిన్ చంద్ర
5. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి- కంభంపాటి సత్యనారాయణ